పదిలమైన ప్రణాళికతో విజయం

- పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్న పదో తరగతి విద్యార్థులు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ
- కేటగిరీలుగా విభజించి ప్రత్యేక శిక్షణ



బీవీఆర్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి విద్యార్థులకు మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడంతో పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. గతంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. గత కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక తరగతలు నిర్వహించి అంతే పట్టుదలతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. గతంలో పదో తరగతి పాస్, ఫెయిల్ దాదాపుగా 70–30 శాతంగా ఉండేవి. నేటి పరిస్థితి చాలా భిన్నంగా ఉంటుంది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం విద్యార్థుల్లో వారికున్న ప్రతిభను బట్టి ఏ, బీ, సీ గ్రేడులుగా విభజించి వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించి బోధనల్లో ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నారు. విద్యాశాఖ ప్రకటనలతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రణాళికను సిద్ధం చేశారు. మొత్తం అన్ని సబ్జెక్టుల్లో సిలబస్‌లను పూర్తి చేశారు. ప్రస్తుతం పాఠశాలలు ముగిసిన తర్వాత రోజూ గంట గంటన్నర సేపు రోజుకో సబ్జెక్టుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక మెటీరియల్‌తో శిక్షణ

పదో తరగతి విద్యార్థులు గతంలో కంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో జెడ్పీ చైర్మన్, జిల్లా విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా విజయకేతనం పుస్తకం విడుదల చేశారు. అలాగే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు గణిత దీక్ష పేరున నిపుణులతో స్టడీ మెటీరియల్ తయారు చేయించారు. ఈ రెండు పుస్తకాలను జిల్లాలో ప్రతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. రోజుకో స్టడీ మెటీరియల్ అంశాలను చదివిస్తున్నారు. అలాగే ప్రతిరోజూ ఒక్కో సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆ పరీక్షలో వచ్చే మార్కులను బట్టి లోటు పాట్లను వెతికి ఆ విద్యార్థికి మరింత శిక్షణ ఇస్తున్నారు. అలాగే వీక్లీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి రెండు వారాలు పూర్తవ్వగా మిగిలిన నాలుగు వారాలు పరీక్షల సమయం నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు.

నియోజకవర్గంలో విద్యార్థులు ఇలా

పాలకొల్లు పట్టణంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 485 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాలకొల్లు మండలంలో 8 ఉన్నత పాఠశాలల్లో 560 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 3 ఎయిడెడ్ పాఠశాలల్లో 30 విద్యార్థులు చదవుతున్నారు. అలాగే యలమంచిలి మండలంలో 12 ఉన్నత పాఠశాలలో 650 మంది విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



పూర్తయిన పాఠ్యాంశాలపై రోజుకో సబ్జెక్ట్ చొప్పున ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను ఏ,బీ,సీ,డీలుగా విభజించి వెనుకబడిన విద్యార్థులను సీ,డీలుగా విభజిస్తున్నాం. వారిని ప్రతిభ ఉన్న ఏ,బీ విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక సాధన చేయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. స్టడీ మెటీరియల్ చదివించడం, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో? విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజూ పాఠశాలలను పర్యవేక్షించి విద్యార్థుల ప్రతిభా పాటవాలను గుర్తిస్తున్నాం

– గుమ్మళ్ల వీరాస్వామి, మండల విద్యాశాఖ అధికారి 1, పాలకొల్లు

ప్రత్యేకంగా మెటీరియల్



విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెటీరియల్ అందించారు. యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కూడా స్టడీ మెటీరియల్ ఇచ్చారు. ఒక్కో సబ్జెక్ట్‌లో నాలుగు పేపర్లు ఉండేలా మెటీరియల్ సిద్ధం చేశారు. వాటిని విద్యార్థులకు అందించాం. జిల్లా విద్యాశాఖ అందించిన గణిత దీక్ష, విజయకేతనం మెటీరియల్స్‌తో పాటు యూటీఎఫ్ అందించిన మెటీరియల్ కూడా విద్యార్థులకు అందించాం. గత సంవత్సరం కన్నా విద్యార్థులకు మరింత మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

– వై.ప్రభాకరశాస్త్రి, హెచ్‌ఎం, బీవీఆర్‌ఎం గరల్స్ హైస్కూల్

క్లుప్తంగా

యలమంచిలి మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా గోపి



కవురు గోపి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా పెనుమర్రు సర్పంచ్ కవురు గోపిని నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గురువారం రాత్రి ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ ఇన్‌చార్జ్, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు గోపిను నియమించినట్లు ఆయన తెలిపారు.

కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై అవగాహన



మురళీకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుందని డాక్టర్ ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ భాషా నైపుణ్యాలైన రాయడం, చదవడం, మాట్లాడడం, వినడం అనేవి విద్యార్థి దశలో చాలా ముఖ్యమైన అంశాలని అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణను కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు హేమలత, నోబుల్ రాజ్, శిరీష జూలియా, రమేష్, డాక్టర్ స్వరూప్ సింగ్, డాక్టర్ రమణ, రామ్మోహనరావు పాల్గొన్నారు.

అవినీతిపరులు ఎవరో ప్రజలకు తెలుసు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో అవినీతిపరులు ఎవరో ప్రజలకు తెలుసునని ఆచంట ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం అన్నారు. గురువారం తూర్పుపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ 15 ఏళ్ల పాలనలో పూర్తిగా అవినీతికి పాల్పడిన టీడీపీ నాయకులు ఆచంట శాసన సభ్యుడు శ్రీరంగనాథరాజు పై బురద జల్లడానికి యత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఫ్రీ ఇసుక పాలసీ ఉన్నా వేలాది రూపాయలకు అమ్ముకున్న ఘనత టీడీపీ నాయకులకే దక్కుతుందన్నారు. నేడు ఇసుక పాలసీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉందన్నారు. వాస్తవాలు దాచి బురద జల్లుతుంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వారి చేసిన అవినీతి నుంచి తప్పించుకోవడానికి ఇతరులకు బురద జల్లితే సరిపోతుందన్న భావనలో టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. ప్రజావసరాలకు నిర్మిస్తున్న కమ్యూనటీ భవనాలపైనా ప్రజలను మభ్య పెట్టడానికి చూస్తున్నారనానరు. ఇకనైనా బురద జల్లే కార్యక్రమాలు మానుకోవాలని హితవు పలికారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు.

17న వలంటీర్లకు సన్మానం

పాలకోడేరు: గ్రామ వలంటీర్లను ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా సన్మానిస్తున్నట్టు ఎంపీడీవో టి.అనూహ్య తెలిపారు. ఈనెల 17వ తేదీన పాలకోడేరు మండల సమాఖ్య భవనంలో పాలకోడేరు, కొండేపూడి, వేండ్ర, గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోని వలంటీర్లను, విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, శంగవృక్షం గ్రామాల్లోని వలంటీర్లను 22వ తేదీన శంగవృక్షం ఆర్యవైశ్యుల కళ్యాణ మండపంలో సన్మానిస్తామని, ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతారని ఎంపీడీవో చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడిచేసి 6గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,030 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అక్రమ మద్యం కలిగిన వ్యక్తి అరెస్టు

ఆకివీడు: స్థానిక శ్రీనగర్ కాలనీలో అక్రమ మద్యం కలిగిన ఉన్న శనగన వెంకటేశ్వరరావును గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు. అతని వద్ద నుంచి 180 ఎంఎల్ బాటిళ్లు 4, బీరు బాటిళ్లు 4 స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఇరగవరం: రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజారంజక పాలనతోనే వైఎస్సార్‌సీపీలో చేరికలు ఉంటున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం మండలం కె. ఇల్లిందలపర్రు గ్రామంలో 500, పేకేరు శివారు నిట్లవారితోట గ్రామంలో 150, ఓగిడి గ్రామంలో 200, అయినపర్రు గ్రామంలో 150, కాకిలేరు గ్రామంలో 200 మొత్తంగా 1,200 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి మంత్రి కారుమూరి సాదరంగా ఆహ్వానించారు.

నగదు పురస్కారాలకు వలంటీర్ల ఎంపిక

మొగల్తూరు: సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో విశిష్ట సేవలందించిన వలంటీర్లు సేవా వజ్ర, సేవారత్న అవార్డులకు ఎంపికయ్యారని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 381 మంది వలంటీర్లకు గానూ ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవా రత్న, మిగిలిన వారికి సేవా మిత్ర అవార్డులు అందివ్వనున్నట్లు ఎంపీడీఓ వివరించారు. మండలంలోని ముత్యాలపల్లి, కొత్తోటలకు చెందిన బొక్కా నాగబాబు, దాడి నాగలక్ష్మిలు సేవా వజ్రలకు, ముత్యాలపల్లికి చెందిన దీనా మోకా, కొత్తోటకు చెందిన భవాని హేమలత, కేపీ పాలెం నార్త్ వలంటీర్ మెట్టి మోహన్, మొగల్తూరు 3,4 సచివాలయాలకు చెందిన నాగపార్వతి కొక్కిరగడ్డ, కప్పల జ్యోతి సేవా రత్న అవార్డులకు ఎంపికయ్యారన్నారు. సేవా వజ్రలకు మెడల్, శాలువా రూ.45వేలు నగదు, సేవా రత్నలకు మెడల్, శాలువా, బ్యాడ్జ్‌తో పాటు రూ.30 వేలు నగదు, సేవా మిత్రలకు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్‌తో పాటు రూ.15 వేలు నగదును ప్రధానం చేస్తారన్నారు.

నేడు మున్సిపల్ షాపుల వేలం

నరసాపురం: పట్టణంలోని మండ సత్యనారాయణ మూర్తి, ఫిష్‌మార్కెట్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న షాపులను మూడేళ్ల కాల పరిమితితో లీజుకిచ్చే నిమిత్తం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశబూరు. ఇప్పటికే 20 షాపులకు వేలం నిర్వహించామని, మిగిలిన 20 షాపులకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం



డీఎల్‌డీఓ కార్యాలయం ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 5వ వార్డు గంటాలమ్మగుడి వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 5 ఏళ్ల నుంచి నియోజకవర్గంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. వశిష్ట వంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులను కొలిక్కి తీసుకొచ్చామని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. పట్టణంలో రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్ ఆధునికీకరణ, పార్కుల అభివృద్ధి జరిగాయన్నారు. నియోజకవర్గంలో కమ్యూటినీ హాల్స్ నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు.

డీఎల్‌డీఓ కార్యాలయం ప్రారంభం..

పట్టణంలోని 24వ వార్డులో రూ.6 లక్షలతో నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని ముదునూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, కౌన్సిలర్లు కావలి రామసీత, పతివాడ పద్మ, జిల్లెళ్ల దిలీప్, గోరు సత్తిబాబు, బి.విజయ భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, కావలి నాని పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యాసామగ్రి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పితాని చిన్నా తదితరులు

పోడూరు: పదో తరగతి విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పితాని చిన్నా పిలుపునిచ్చారు. షేరింగ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పెనుమదం జెడ్పీ హైస్కూలులోని పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, పెన్నులు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల కన్వీనర్ చిన్నా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడినందున విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు, ఆటలకు దూరంగా ఉండి ఎక్కువ సమయం చదువు కోసం కేటాయించాలన్నారు. హైస్కూల్ విద్యార్థులంతా పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తానేటి బాబూరావు, స్కూల్ కమిటీ చైర్మన్ దొంగ భాస్కరరావు, బొడ్డు బాబి, బీరా రాజశేఖర్, కొల్లి వెంకట్రావు, కడలి మీరా విజయకుమార్ రాజు, కడలి మీరా కిరణ్, హైస్కూలు హెచ్‌ఎం సీహెచ్‌వీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ శాంతిథాంలో లక్ష పసుపు కొమ్ముల పూజ



పెనుగొండ వాసవీ శాంతి థాంలో లక్ష పసుపుకొమ్ముల వ్రతం నిర్వహించిన దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో గరిసి ధాన్య వ్రతం, లక్ష పసుపుకొమ్ముల నోము భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి వాసవీ శాంతి థాంలో మరకత శిల శాసవీ మాతకు అభిషేకాలు, సహస్రనామార్చన, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శిష్టా మణికంఠ అర్చకత్వంలో బెంగుళూరుకు చెందిన పోతన శెట్టి దంపతులు లక్ష పసుపు కొమ్ముల వ్రతం, గరిసి ధాన్య వ్రతం నిర్వహించారు. నోము, వ్రతం పూర్తయిన అనంతరం వాసవీ మాతకు నృత్య నీరాజనం ఇచ్చారు. కర్ణాటక భక్తులతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలకు వ్రతంలోని పసుపు కొమ్ములు అందుకోవడనికి బారులు తీరారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

భీమవరం: ప్రణాళికతో చదివితే విజయం తప్పక లభిస్తుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యాన స్థానిక త్యాగరాజ భవనంలో గ్రూప్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ముందుగా అభినందనలు తెలిపారు. అనంతరం పరీక్షల పట్ల దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీ మూర్తి మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ, ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం లక్ష్మణరావు సిద్ధం చేసిన గ్రూప్స్ మెటీరియల్‌ను 250 మంది అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీఆర్ఎల్ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ శ్రీవాణి, ఎస్‌వీకేపీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహారాజు, యూటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు రామకృష్ణ, భవాని ప్రసాద్, జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, పవన్ కుమార్, నాయకులు జి.శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి



మహిళతో మాట్లాడుతున్న నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల, పాలకొల్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు పట్టణంలోని 10వ వార్డు ఎంబేరియన్‌పేట, చింతలతోట, మార్కుపేటలో గురువారం జగనన్నతో జనం.. గోపన్నతో మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమాబాల, గోపి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అందిన తీరు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలన్నీ మహిళలకు అందించి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా గుర్తింపు తెచ్చారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళుతున్న సమయంలో ప్రజలే నవరత్నాల పథకాలు తమకు ఏ మేరకు అందాయో? వివరిస్తుంటే చాలా సంతోషం కలుగుతోందన్నారు. ప్రతి ఇంటికీ నవరత్నాల పథకాల్లో నాలుగు నుంచి ఐదు పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. మరోసారి సీఎంగా జగన్‌కి అవకాశం కల్పిస్తే రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఏఎంసీ చైర్మన్ సాలాదేవి, వార్డు ఇన్‌చార్జ్ చదలవాడ సాల్మన్, వార్డు నాయకులు నక్కా చిత్తరంజన్‌దాస్, ఉండ్రాజవరపు రవి కుమార్, మాముడూరి నాగమణి, రొక్కాల మేరీ, కారుమంచి కిరణ్, బందెల బాబూరావు, నక్కా సహదేవుడు, ఈద మధు తదితరులు పాల్గొన్నారు.

అవ్వకు ఆపన్న హస్తం



వృద్ధురాలు సూరమ్మ పరిస్థితి ఆరా తీస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 10వ వార్డులో జగనన్నతో జనం.. గోపన్నతో మనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 10వ వార్డు ఎంబేరియన్‌పేటకు చెందిన వృద్ధురాలు చెయ్యేటి సూరమ్మ (75) పరిస్థితి చూసి వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ చలించిపోయారు. ఆమె క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో చిన్న పూరి గుడిసె వేసుకుని అందులో జీవనం సాగిస్తోంది. ఆమె పూరిగూడెసె పాడైనా ఆర్థిక సమస్యలతో అందులోనే జీవనం సాగిస్తుంది. ఆమెకు ఇరువురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరిలో ఒక కుమారుడు చిట్టవరంలో ఉంటారు. ఒక కుమారుడు స్థానికంగా ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నారు. వారంలో రెండు రోజులే పని దొరుకుతుంది. అతని జీవన పరిస్థితి అంతంత మాత్రమే. ప్రతి నెలా వలంటీర్ స్వాతి ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తుంది. ఒక పూట కొడుకు భోజనం అందిస్తే, రెండో పూట కుమార్తె భోజనం పెడుతుంది. అయితే వృద్ధురాలి పరిస్థితి చూసి చలించిన గోపి సూరమ్మను వృద్ధాశ్రమంలో చేర్పించచడానికి ఏర్పాట్లు చేశారు. వేడంగిపాలెంలో విశ్వమానవ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆమెను ఉంచడానికి గోపి ఏర్పాట్లు చేశారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

యలమంచిలి: మండల పరిషత్ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ చెప్పారు. మేడపాడులో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో గ్రామ సమస్యలన్నింటికీ పరిష్కారం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, మాజీ ఉప సర్పంచ్ గంధం సత్యకీర్తి, హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ముద్దల గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు డేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అతిరుద్ర మహాయాగం



కవిటంలో యాగమహోత్సవంలో పాల్గొన్న గూడూరి ఉమాబాల దంపతులు

పోడూరు: కవిటం గ్రామంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సహస్రచండీ సహిత మహాసార పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహా విద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరి ఉమాబాల దంపతులు పాల్గొన్నారు. యాగమహోత్సవాలకు విచ్చేసిన ఉమాబాల దంపతులకు వేదపండితులు ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. యాగమహోత్సవాల్లో భాగంగా వేదపండితులు రుద్రహోమం, అరుణ హోమం, చండీ హోమం, ఈశ్వరునికి రుద్రపారాయణల అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి శ్రీ జ్ఞాన ప్రసునాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ), సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, పడాల వెంకట సత్యనారాయణ రెడ్డి (అబ్బు), ఎంపీటీసీ కుక్కల సూర్యనారాయణ, మేడపాటి రామారెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, బాలాజీ రెడ్డి , మండ కాశీవిశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా గ్రామాల అభివృద్ధి

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో అభివృద్ధి చురుగ్గా సాగుతోంది. సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణంతో గ్రామం అభివృద్ధిలో మిగిలిన గ్రామాలతో పోటీ పడుతోంది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికాగా, ఇప్పుడు ఉండి రాజులపేట, పడవలరేవు, ఉండితోట, కోండ్రోతుపేట ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం ప్రారంభమైంది. గురువారం రాజులపేటలో ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ ఆధ్వర్యంలో రూ.10లక్షల జెడ్పీ నిధులతో సీసీ డ్రెయి న్ పనులను ప్రారంభించారు. సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యాన నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు సుమారు రూ.100 కోట్లతో నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు.

విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేయాలి

భీమవరం: విద్యాసంస్థల్లో విద్యార్థులకు హెల్మెట్ తప్పనిసరి చేస్తే ప్రమాదాల నివారణకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా రవాణాశాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యాన గురువారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో రోడ్డు ప్రమాదాల్లో యువతే 80 శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్ల తీవ్ర గాయాలు పాలుకావడం, మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరం ట్రాఫిక్ సీఐ జి.దాస్, రవాణాశాఖాధికారులు సీహెచ్ వెంకటేశ్వరరావు, కేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.